క్లుప్తంగా

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

రావులపాలెం: స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్‌లో విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం మంగళవారం మండలంలోని కొమరాజులంకలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎం.రవికుమార్ సోమవారం తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

అప్పనపల్లి దేవస్థానం ఈఓగా వరప్రసాదరావు


శ్రీరామవరప్రసాదరావు

మామిడికుదురు: అప్పనపల్లి బాల బాలాజీ దేవస్థానం కార్యనిర్వహణాధికారి(ఈవో)గా డి.శ్రీరామ వరప్రసాదరావు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన ఎన్టీఆర్ జిల్లా తిరుమలగిరి వేంకటేశ్వరస్వామి దేవస్థానం ఈఓగా పనిచేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇంత వరకు అప్పనపల్లిలో ఈఓగా పనిచేసిన ఎంకేటీ నాగవరప్రసాదరావు తిరుమలగిరి వేంకటేశ్వరస్వామి దేవస్థానానికి బదిలీ అయ్యారు. వరప్రసాదరావు మాట్లాడుతూ బాలబాలాజీ స్వామి ఆలయం అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఈ ఆలయానికి పూర్వ వైభవం తీసుకువచ్చే దిశగా పని చేస్తానని చెప్పారు.

డ్రైనేజీ ఏర్పాటు చేయాలి

మలికిపురం: మండలంలోని లక్కవరంలో ప్రధాన కూడలిలో డ్రైనేజీ ఏర్పాటు చేయాలని వర్తక సంఘం నాయకులు పంచాయతీకి విజ్ఞప్తి చేశారు. సోమవారం గ్రామంలో వర్తక సంఘం నాయకులు అడబాల గంగరాజు, బొడ్డపాటి రవి, అడబాల గోపి తదితరులు మాట్లాడుతూ పన్నులు కట్టించుకుంటున్న పంచాయతీ డ్రైనేజీ ఏర్పాటు చేయడడం లేదని పేర్కొన్నారు. డ్రైనేజీ ఏర్పాటు చేస్తే పంట కాలువలలోకి ఏర్పాటు చేసిన మురుగునీటి తూరల సమస్య తొలగిపోతుందని అన్నారు.

నియోజకవర్గంలో 38,414 మందికి పింఛన్లు

మామిడికుదురు: రాష్ట్రం ఆర్థికంగా ఎన్ని ఇబ్బందుల్లో ఉన్న సంక్షేమ పథకాలను అమలు చేయడంలో వైఎస్సార్ సీపీ సర్కారు ఏ మాత్రం వెనుకడుగు వేయడం లేదని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు పేర్కొన్నారు. ఆయన సోమవారం నగరంలో లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. నియోజకవర్గ పరిధిలో ప్రతి నెలా 38,414 మందికి పింఛన్లు అందిస్తున్నామన్నారు. తెల్లవారు జామునే లబ్ధిదారుల తలుపుతట్టి, వారిని లేపి పింఛన్లు ఇస్తున్న ఘనత సీఎం జగన్‌కే దక్కిందన్నారు. కార్యక్రమంలో వలంటీర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.

బస్సు ఢీకొని ఆబోతు మృతి

అంబాజీపేట: మాచవరం శివారు వేంకటేశ్వర కాలనీ సమీపాన సోమవారం కాలేజ్ బస్ ఢీకొని ఆబోతు మృతి చెందింది. దీనికి సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అంబాజీపేట వైపు వస్తున్న ఆబోతును శ్రీనివాస ఇంజినీరింగ్ కళాశాల బస్ బలంగా ఢీ కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందింది. దాంతో స్థానికుల సహకారంతో ఆబోతుకు పూజలు నిర్వహించి, శాస్త్రోక్తంగా అంత్యక్రియలు నిర్వహించారు.

ప్రతాప్‌కు శ్రీశ్రీ జీవిత సాఫల్య పురస్కారం

సఖినేటిపల్లి: వీవీమెరక గ్రామానికి చెందిన శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్, తాడేపల్లిగూడెం తెలుగు సాహితీ సమాఖ్య ద్వారా మహాకవి శ్రీశ్రీ జీవిత సాఫల్య పురస్కారాన్ని ఆదివారం రాత్రి అందుకున్నారు. తాడేపల్లిగూడెం బీవీఆర్ కళాకేంద్రంలో సమాఖ్య ఆధ్వర్యాన మహాకవి శ్రీశ్రీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రతాప్ చేస్తున్న సేవలకు గుర్తింపుగాను పై పురస్కారం అందజేసింది. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ ఈ.భీమశంకరరావు, ఏపీ నాటక సమాఖ్య అధ్యక్షుడు బుద్దాల వెంకటరామారావు, పి.శ్రీనివాస్, కొల్లి రమాదేవి, జి.బాపన్న, కె.శ్రీను పాల్గొన్నారు.

మకరతోరణం సమర్పణ

ఆత్రేయపురం: పురాణ ప్రసిద్ధి చెందిన ర్యాలి జగన్మోహినీ కేశవ స్వామి ఆలయ అవరణలో వేంచేసిన శ్రీరామ సత్యనారాయణ స్వామికి రూ.17,800 విలువైన ఇత్తడి మకర తోరణం భక్తులు సమర్పించినట్లు ఆలయ ఈఓ కృష్ణ చైతన్య తెలిపారు. రావులపాలెం మండలం ఊబలంకకు చెందిన కోనాల నాగిరెడ్డి–లక్ష్మి దంపతులు దీనిని సమర్పించినట్లు తెలిపారు.

బైక్ చోరీ ముద్దాయిల అరెస్ట్

సఖినేటిపల్లి: వేర్వేరు ఏరియాల్లో బైక్ చోరీలకు పాల్పడుతున్న ఇతర ప్రాంతాలకు చెందిన ముగ్గురు ముద్దాయిలను ఆదివారం సాయం సఖినేటిపల్లి మూడుతూముల సెంటర్లో అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి ఐదు బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్సై ఎస్.రాము సోమవారం చెప్పారు. జిల్లా ఎస్పీ ఎస్.శ్రీధర్ ఆదేశాలపై కొత్తపేట ఎస్‌డీపీవో కేవీ రమణ పర్యవేక్షణలో రాజోలు సీఐ ఎం.శేఖర్‌బాబు, సఖినేటిపల్లి ఎస్సై ఎస్.రాము, సిబ్బంది ఈ ఆపరేషన్‌లో పాల్గొన్నారు. వివరాలిలా ఉన్నాయి. పట్టుబడ్డ ముద్దాయిల్లో గన్నవరం మండలం ముంజవరానికి చెందిన కర్రి ఆదిత్యవినాయక పవన్‌కుమార్, పశ్చిమగోదావరి జిల్లా నర్సాపురంకు చెందిన జోశ్యుల సుబ్రహ్మణ్య విశ్వేశ్వరరావు, బైర లోకేష్ ఉన్నారు. వీరి ముగ్గురు ముద్దాయిలపై ఇప్పటికే సఖినేటిపల్లి పీఎస్‌లో 2, రాజోలు పీఎస్‌లో 1, రావులపాలెంలో 1, విజయవాడ సిటీ పీఎస్‌లో 1 కేసులు నమోదైనట్టు పోలీసులు చెప్పారు.

కళ్లాల్లో ధాన్యం.. కళ్లల్లో దైన్యం

- అకాల వర్షాలతో రైతుల కుదేలు
- తడిసి ముద్దయిన వరి పంట

మామిడికుదురు: అకాల వర్షం రైతులకు తీరని నష్టాన్ని మిగిల్చింది. వర్షాకాలాన్ని తలపించే విధంగా సోమవారం ఉదయం భారీ వర్షం కురిసింది. ఆ వర్షానికి పనలపై ఉన్న పంట తడిసి ముద్దయింది. ఈదురుగాలులకు కోతకు వచ్చిన చేలు నేలకొరిగాయి. మండలంలో 2,957 ఎకరాల విస్తీర్ణంలో వరి సాగు చేశారు. సుమారు 100 ఎకరాల్లో పంట పనలపై ఉంది. 200 ఎకరాల్లో పంట కోత కోసి కుప్పలుగా వేశారు. భారీ వర్షానికి కుప్పలు తడిసిపోకుండా వాటిపై బరకాలు కప్పారు. మామిడికుదురు, నగరం, గెద్దాడ, మొగలికుదురు గ్రామాల్లోని పంట పొలాల్లో ఉన్న పంట తడసిపోయింది. ఎంతో కష్టపడి పండించిన పంట చేతికి వచ్చే దశలో అకాల వర్షాలు తమను తీవ్రంగా దెబ్బతీశాయని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో పాటు మండలంలోని పెదపట్నంలంక, బి.దొడ్డవరం, అప్పనపల్లి, నగరం, ఆదుర్రు, మామిడికుదురు తదితర గ్రామాల్లో పడుగుపై ఉన్న ఇటుకలు తడిసిపోయాయి. అకాల వర్షాల వల్ల తమకు తీవ్ర నష్ట కలిగిందని బట్టీ యజమానులు వాపోయారు. కాగా నగరం పితానివారిమెరకలో భారీ వర్షాల వల్ల తడిసిపోయిన వరి పనలను ఆర్డీఓ వసంతరాయుడు, తహసీల్దార్ నాగలక్ష్మమ్మ, ఏఓ బి.మృదుల పరిశీలించారు. పంట పాడైపోకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రెండు రోజుల పాటు కోతలను వాయిదా వేసుకోవాలని సూచించారు.

అంబాజీపేటలో..

అంబాజీపేట: దాళ్వా వరి చేతికి వస్తున్న తరుణంలో అకాల వర్షం రైతులను తీవ్ర ఇబ్బందులకు గురి చేసింది. మండలంలో సోమవారం వేకువజాము నుంచి సుమారుగా 5 గంటల పాటు కురిసిన భారీ వర్షం అన్నదాతల గుండెల్లో పరుగులు పెట్టించింది. కళ్లాల్లో ఉన్న ధాన్యాన్ని ఒబ్బిడి చేసుకోవడానికి రైతులు తీవ అవస్థలు పడ్డారు. ధాన్యం తడిచిపోకుండా బరకాలు కప్పి జాగ్రత్తలు తీసుకోగా, కోత యంత్రాలతో చేపట్టే వరి మాసూళ్లను వాయిదా వేసుకున్నారు. ఆకస్మికంగా కురిసిన భారీ వర్షానికి చేలల్లో ఉన్న ధాన్యం రాశులు నీటిలో నానాయి. వాటిని ఒడ్డుకు తీసుకువచ్చేందుకు రైతులు నానా అవస్థలు పడ్డారు. ఈదురుగాలులకు మొసలపల్లి, చిరతపూడి, ఇసుకపూడి, పసుపల్లి, ఇరుసుమండ తదితర గ్రామాల్లో వరి చేలు నేలకు వరిగాయి. భారీ వర్షానికి అంబాజీపేట, పుల్లేటికుర్రు, ముక్కామల ప్రధాన రహదారుల్లో జనజీవనం స్తంభించింది. మండలంలో 55.8 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదయిందన్నారు.


నగరంలో తడిసి ముద్దయిన వరి పనలు

కూలిన విద్యుత్ స్తంభాలు

మలికిపురం: మండలంలో సోమవారం కురిసిన భారీ వర్షాలకు జనజీవనం స్తంభించింది. ఈదురుగాలులకు రామరాజులంకలో 33 కేవీ విద్యుత్ లైన్ స్తంభాలు ధ్వంసమయ్యాయి. అలాగే మరో 3 ఇంటి సర్వీసుల స్తంభాలతో పాటు ఆరు విద్యుత్ స్తంభాలు నేల కొరిగాయి. ఏఈ మద్దూరి శ్రీనివాస్ తన సిబ్బందితో వెళ్లి మరమ్మతులు చేశారు. ప్రధానంగా పిడుగులు, ఈదురుగాలుల వల్ల విద్యుత్ శాఖకు తీవ్ర నష్టం సంభవించింది.

పి.గన్నవరంలో..

పి.గన్నవరం: మండలంలో సోమవారం ఉదయం కురిసిన భారీ వర్షంతో చేలలో ఉన్న ధాన్యం తడిసిపోవడంతో రైతన్నలు ఆందోళన వ్యక్తం చేశారు. ఉదయం 7 నుంచి 10 గంటల వరకూ భారీ వర్షం కురిసింది. పనల మీద ఉన్న చేలు నీట మునిగాయి. పలు గ్రామాల్లో కళ్లాల్లో ఉన్న ధాన్యం రాశుల చుట్టూ వర్షపునీరు చేరింది. రైతులు వర్షంలో తడుస్తూ పంటను రక్షించుకునే చర్యలు చేపట్టారు. పంట చేతికి వచ్చే సమయంలో అకాల వర్షాలు తమను నష్టాలకు గురి చేస్తున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. భారీ వర్షంతో మండలంలోని పల్లపు ప్రాంతాలను వర్షపునీరు చుట్టుముట్టింది. రోడ్లు జలమయమయ్యాయి. మధ్యాహ్నం వరకూ జనం ఇళ్లకు పరిమితం అయ్యారు.


అప్పనపల్లిలో పచ్చి ఇటుకలపై కప్పిన బరకాలు

కొత్తపేటలో..

కొత్తపేట: ఆరుగాలం శ్రమించి పండించిన పంట చేతికందే సమయంలో ప్రకృతి కన్నెర్ర చేసి, రైతులను ముంచేసింది. దాళ్వా కోతలు కోస్తున్న సమయంలో, మాసూళ్లు చేసి ధాన్యం ఆరబోత చివరి దశలో అకాల వర్షాలు అన్నదాతలను అయోమయ పరిస్థితులకు గురి చేశాయి. ఈసారి కూడా దాళ్వా వరి పంట బాగా పండింది. దిగుబడులు ఆశాజనకంగా వస్తున్నాయని రైతులు ఆనందంగా ఉన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో ద్రోణి ప్రభావంతో గత నెల 23 నుంచి చెదురు మదురు వర్షాలు పడుతూ రైతులను ఉరుకులు, పరుగులు పెట్టిస్తూ ఆందోళనకు గురిచేశాయి. పలు ప్రాంతాల్లో ఒక మోస్తరుగా వర్షాలు కురిశాయి. అయితే సోమవారం తెల్లవారు జాము నుంచి భారీ వర్షం కురవడంతో చేలల్లో నీరు నిలిచిపోయింది. పలు రాశుల మట్టుకు నీరు చేరింది. ఆ ధాన్యం రాశులను మెరక ప్రాంతాలకు చేర్చుకునే పనిలో నిమగ్నమయ్యారు. ధాన్యం తడిసి తేమ శాతం పెరిగిపోయి, ధర తగ్గిపోతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.


గంగలకుర్రులో కళ్లాల్లో ఉన్న ధాన్యాన్ని ఒడ్డుకు చేర్చుకుంటున్న రైతులు

తడిసిన ధాన్యాన్ని సంరక్షించుకోవాలి

కొత్తపేట నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో సుమారు 32 వేల ఎకరాల విస్తీర్ణంలో దాళ్వా వరి సాగు చేయగా ఇప్పటికి సుమారు 30 శాతం మేర కోతలు పూర్తయ్యాయి. కోసి రాశులు పోసిన ధాన్యాన్ని, చేనుపై ఉన్న పంటను ఉప్పుతో సంరక్షించుకోవాలి. తడిసిన ధాన్యాన్ని 100 లీటర్లకు 5 కేజీల ఉప్పును కలుపుకోవాలి. వాతావరణం తెరిపిస్తే ధాన్యం రాశులపై బరకాలు తీసి నిర్ణీత తేమ శాతానికి (17 శాతం) వచ్చేలా ఆరబెట్టుకోవాలి. కోతకు సిద్ధంగా ఉన్న పంటపై ఒక లీటరు నీటికి 5 శాతం అంటే 50 గ్రాముల ఉప్పు ద్రావణాన్ని ఎకరానికి 200 లీటర్ల ద్రావణం పిచికారీ చేయాలి.

– ఎం.వెంకటరామారావు, ఏడీఏ, కొత్తపేట


గంగలకుర్రులో తడిసిన ధాన్యం బస్తాలు


రామరాజులంకలో నేలకొరిగిన స్తంభాలను సరిచేస్తున్న విద్యుత్ శాఖ సిబ్బంది


కొత్తపేటలో ధాన్యం రాశి చుట్టూ చేరిన వర్షపునీరు

ధాన్యం తడిసిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

అంబాజీపేట: అకాల వర్షాలకు ధాన్యం తడిచిపోకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కొత్తపేట ఆర్డీవో ఎం.ముక్కంటి అన్నారు. గంగలకుర్రులో ధాన్యం రాశులను ఆయన సోమవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ వరి చేలల్లో వున్న ధాన్యం రాశులను ఒడ్డుకు చేర్చుకుని తడిచిపోకుండా బరకాలు కప్పాలన్నారు. అంతకుముందు మండల ప్రత్యేకాధికారి ఎస్.మల్లికార్జునరావు, ఏవో సీహెచ్‌డీ విజయ్‌కుమార్, తహసీల్దార్ టి.మంగతాయారు. ఎంపీడీఓ ఐ.రత్నంరాజులు మండలంలో వరి చేలను పరిశీలించి రానున్న రెండు రోజులు వర్షాలు పడే అవకాశం ఉందని తీసుకోవల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఏఈఓ డి.దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు

పి.గన్నవరం: భారీ వర్షాల నేపథ్యంలో రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని కొత్తపేట ఆర్డీఓ ఎం.ముక్కంటి తెలిపారు. మండలంలోని జి.పెదపూడి, పోతవరం గ్రామాల్లో సోమవారం ఆయన పర్యటించి కళ్లాల్లో ఉన్న ధాన్యం రాశులను, చేలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన రైతులతో మాట్లాడారు. రైతులకు కావాల్సిన గోనె సంచులు సరఫరా చేస్తామన్నారు. అనంతరం ఆయన జి.పెదపూడిలో రైసు మిల్లును పరిశీలించారు. రైతులు తీసుకువచ్చిన ధాన్యాన్ని వెంటనే తీసుకోవాలని ఆదేశాలిచ్చారు. ఊడిమూడి శివారు ఉచ్చులవారిపేటలో తహసీల్దార్ జి.రవీంద్రనాథ్ ఠాగూర్ దగ్గరుండి ధాన్యం బస్తాలను మిల్లుకు ఎగుమతి చేయించారు. ధాన్యం తడవకుండా రైతులకు టార్పాలిన్లు అందిస్తామన్నారు. ధాన్యం బస్తాలను మిల్లుకు తరలించేందుకు ట్రాక్టర్లను సిద్ధం చేసినట్టు తెలిపారు. మండల వ్యవసాయ అధికారి కళ్యాణ్‌కుమార్ పలు గ్రామాల్లో పర్యటించి రైతులకు సూచనలిచ్చారు.


జి.పెదపూడిలో రైతులతో మాట్లాడుతున్న ఆర్డీఓ ముక్కంటి

రేషన్ పంపిణీపై సమగ్ర సర్వే

రాజోలు: రేషన్ పంపిణీ విధానంపై పొదలాడ గ్రామంలో సమగ్ర సర్వే నిర్వహిస్తున్నట్టు పౌరసరఫరాల డిప్యూటీ తహసీల్దార్ దేవళ్ల శ్రీనివాస్ తెలిపారు. సోమవారం ఆయన పొదలాడలో పలువురు రేషన్ కార్డు దారులను కలసి రేషన్ పంపిణీ విధానం, నాణ్యత తదితర అంశాలపై సర్వే చేశారు. రేషన్ వాహనం ద్వారా ఇంటింటికీ రేషన్ అందిస్తున్నా కొందరు రేషన్ తీసుకోవడం లేదని అటువంటి వారి వివరాలను సేకరిస్తున్నామన్నారు. పొదలాడలో 940 కార్డులకు 867 మంది రేషన్ కార్డుదారులు రేషన్ తీసుకున్నారన్నారు. అయితే మిగిలి రేషన్‌కార్డు దారుల్లో కొందరు హైదరాబాద్, చనిపోవడం, ఆరోగ్య సమస్యల కారణంగా రేషన్ తీసుకోలేదని గుర్తించామన్నారు. నూరు శాతం రేషన్ తీసుకునే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. జిల్లా జేసీ ధ్యానచంద్ర ఆదేశాలతో పొదలాడలో సర్వే చేస్తున్నామన్నారు. వీఆర్వో అప్పారి గంగాధరం, జి.తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

రైతులు ఇబ్బంది పడకుండా ధాన్యం కొనుగోలుకు చర్యలు

కొత్తపేట: ప్రసుత్తం అకాల వర్షాల నేపథ్యంలో రైతులు ఏ విధమైన ఇబ్బందులు పడకుండా ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందని జేసీ ధ్యానచంద్ర, ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి భరోసా ఇచ్చారు. సోమవారం వారు కొత్తపేట మండలం పలివెల, రావులపాలెం మండలం దేవరపల్లి, వెదిరేశ్వరం గ్రామాల పరిధిలోని వరి ఆయకట్టు ప్రాంతాల్లో కలిసి పర్యటించారు. చేలల్లో ధాన్యం రాశుల పరిస్థితి పరిశీలించారు. స్థానిక అధికారులతో సమీక్షించి సాగుకు సంబంధించి వివరాలను ఆరా తీశారు. కష్టపడి పండించిన పంట చేతికి వచ్చే సమయంలో అకాల వర్షాలు కురవడం దురదృష్టకరమన్నారు. మీకు అండగా ప్రభుత్వం ఉందని ఎవరూ ఆందోళన పడాల్సిన పనిలేదని భరోసా ఇచ్చారు. చేలల్లో ఉన్న ధాన్యాన్ని మెరక ప్రాంతాలకు చేర్చుకునే విషయంలో రైతులు ఇబ్బందులు పడకుండా తగు చర్యలు తీసుకోవాలని స్థానిక అధికారులను ఆదేశించారు. ఆ మేరకు ఉపాధి కూలీలను ఉపయోగించుకోవాలని సూచించారు. తడిసిన ధాన్యం మొలకెత్తకుండా వ్యవసాయశాఖ సూచనల మేరకు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. తేమ శాతం విషయంలో మిల్లర్లతో మాట్లాడామని తెలిపారు. వారి వెంట ఎంపీపీ మార్గన గంగాధరరావు, పార్టీ నాయకుడు కర్రి నాగిరెడ్డి, ఏడీఏ ఎం.వెంకటరామారావు, తహసీల్దార్ జీడీ కిషోర్‌బాబు, ఎంపీడీఓ ఈ.మహేశ్వరరావు, డీటీ ఎస్.శ్రీనివాస్, ఆర్ఐ కొప్పిశెట్టి ఏడుకొండలు, సచివాలయాలు, ఆర్‌బీకేల సిబ్బంది ఉన్నారు.


పలివెలలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న జేసీ ధ్యానచంద్ర, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి

అర్హులకు సంక్షేమ పథకాలు అందించాలి

మామిడికుదురు: పేద ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందించాల్సిన బాధ్యత సచివాలయ ఉద్యోగులపై ఉందని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు పేర్కొన్నారు. ఆయన సోమవారం పెదపట్నంలంక సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అటెండెన్స్ రిజిస్టర్‌తో పాటు రికార్డులను పరిశీలించారు. సచివాలయ ఉద్యోగులు విధిగా సమయపాలన పాటించాలన్నారు. విధి నిర్వహణలో ఏ ఒక్కరు అలసత్వం చూపినా సహించేది లేదన్నారు. వలంటీర్లతో పాటు ఉద్యోగులు సమన్వయంతో పని చేయాలని చిట్టిబాబు సూచించారు. నిరుద్యోగులకు ప్రభుత్వం ఉద్యోగావకాశాలు కల్పించిందని, చిన్న వయస్సులోనే ఉద్యోగాలు పొందిన వారు బాధ్యతగా పనిచేయాలన్నారు. ఎమ్మెల్యే వెంట పార్టీ మండల అధ్యక్షుడు కొమ్ముల రాము, మాజీ ఎంపీటీసీ జోగి వెంకటరామకృష్ణ, గ్రామ కమిటీ అధ్యక్షుడు రాయుడు ఆనంద్ ఉన్నారు.


పెదపట్నంలంక సచివాలయ రికార్డులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

ఘనంగా స్వామివార్ల కల్యాణం

మామిడికుదురు/అంబాజీపేట/ఆత్రేయపురం/అయినవిల్లి/పి.గన్నవరం: మొగలికుదురులో వేంచేసి ఉన్న శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామి వార్షిక శాంతి కల్యాణం సోమవారం అంగరంగ వైభవంగా జరిగింది. బండారు వెంకటసుబ్బారావు దంపతులు కర్తలుగా పాల్గొని స్వామి కల్యాణ క్రతువును పూర్తి చేశారు. స్వామి వారి మంగళస్నానం అనంతరం పెళ్లి కుమారుడిగా అలంకరించారు. తదుపరి కల్యాణాన్ని ఘనంగా జరిపించారు. తదుపరి ఆలయం వద్ద భారీ అన్న సమారాధన జరిగింది. శ్రీలక్ష్మీఆండాళ్ తాయార్ సమేత వేంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తులను రథంపై ఊరేగిస్తూ గ్రామోత్సవాన్ని కనులపండువగా జరిపించారు. మాచవరంలో వేంచేసిన పార్వతీ సమేత కందుల మల్లేశ్వరస్వామి కల్యాణం సోమవారం రాత్రి అత్యంత ఘనంగా జరిగింది. ఆలయ అర్చకులు కొత్తూరి గున్నేశ్వరశర్మ ఆధ్వర్యంలో స్వామి వారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. అలాగే స్థానిక పెద్దవీధిలోని శ్యామలానగర్లో వేంచేసిన వీణా శ్యామలాంబ సమేత చంద్రశేఖర స్వామి కల్యాణం సోమవారం రాత్రి ఎంతో వైభవంగా జరిగింది. అలాగే కొర్లపాటివారిపాలెంలో శ్రీ భూ సమేత వేంకటేశ్వర స్వామి కళ్యాణోత్సవాల్లో భాగంగా సోమవారం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన తీర్థం వైభవంగా సాగింది. సఖినేటిపల్లి సెంటర్లో కొలువైన పార్వతీ భీమేశ్వర స్వామి కల్యాణం సోమవారం రాత్రి నిర్వహించారు. ఆత్రేయపురం లోని పలు ఆలయాల్లో స్వామివార్లకు ఘనంగా కల్యాణం నిర్వహించారు. అయినవిల్లి విఘ్నేశ్వరుని ఆలయం ప్రాంగణంలో కేశవస్వామికి కల్యాణం నిర్వహించారు. పి.గన్నవరంలో బాలాత్రిపుర సుందరీ సమేత గరుడేశ్వర స్వామి కల్యాణం వైభవంగా జరిగింది. వాడపాలెంలో రమా సహిత సత్యనారాయణస్వామి వారి కల్యాణం వైభవంగా నిర్వహించారు.


కేవీ పాలెంలో దర్శనమిస్తున్న వెంకన్న

'అవర్ ఇండియా' సేవలు అభినందనీయం

కొత్తపేట: అవర్ ఇండియా వెల్ఫేర్ అసోసియేషన్ సేవలు అభినందనీయమని మోడేకుర్రు సర్పంచ్ కుడుపూడి రామలక్ష్మి అన్నారు. మండలంలోని మోడేకుర్రులో అవర్ ఇండియా సంస్థ ఆధ్వర్యంలో పేదలకు ఉచితంగా గుండె వ్యాధుల నిర్ధారణకు సుమారు రూ.60 వేలు విలువైన ఈసీజీ మెషీన్ సమకూర్చారు. ఈ మెషీన్‌ను సోమవారం గ్రామ పెద్దలు శీలం సత్యనారాయణ కుటుంబం చేతుల మీదుగా పంచాయతీకి బహూకరించారు. దానిని సోమవారం సర్పంచ్ రామలక్ష్మి ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ వైద్యుల సూచన మేరకు ఈసీజీ పరీక్ష అవసరమైన వారు ఉచితంగా చేయించుకోవచ్చన్నారు. అదేవిధంగా ఆక్సిజన్ సిలిండర్లు అందుబాటులో ఉన్నాయని, అవసరమైన వారికి ఉచితంగా ఏర్పాటు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో కుడుపూడి వెంకటేశ్వరరావు, అవర్ ఇండియా సంస్థ సభ్యులు, స్థానిక ఆర్ఎంపీ వైద్యులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

కార్మికులను ఆదుకోవాలి

అయినవిల్లి: భవన నిర్మాణ కార్మికులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని శ్రీసిద్ధివినాయక ఎలక్ట్రికల్ ప్రైవేటు వర్కర్లను ప్రభుత్వం ఆదుకోవాలని అ సంఘ అధ్యక్షులు దంగేటి శ్రీనివాసరావు సోమవారం ప్రభుత్వంను కోరారు. ప్రధాన కార్యదర్శి ఎంవీవీడీ ప్రసాద్ తదితరులు ఉన్నారు.

తల్లీకుమారులపై కత్తితో దాడి

ఆలమూరు: మండలంలోని కలవచర్లకు చెందిన కందిబొట్ల వెంకటరమణ అదే గ్రామానికి చెందిన తల్లి బుజ్జి, కుమారుడు రామ్‌చరణ్‌లపై సోమవారం దాడి చేశాడు. వారిరువురి కుటుంబాల మధ్య ఆస్తి తగాదాల నేపథ్యంలో బుజ్జి ఇంటికి వచ్చి కత్తితో దాడి చేశాడు. దీంతో తల్లీకొడుకులకు తీవ్రగాయాలు కాగా వారిద్దరినీ రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. నిందితుడు వెంకటరమణ స్థానిక పోలీసులకు లొంగిపోయాడు. ఈ మేరకు ఎస్సై శివప్రసాద్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

7న బ్లూ మార్చ్ ప్రదర్శన

రావులపాలెం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి పురస్కరించుకుని ఈనెల 7న కొత్తపేట నియోజకవర్గ స్థాయిలో దళిత నేతలతో బ్లూ మార్చ్ (నీలి జెండాల) ప్రదర్శన నిర్వహించాలని నిర్ణయించినట్లు జేఏసీ ఆహ్వాన కమిటీ సభ్యుడు కోనాల అంబేడ్కర్ తెలిపారు. సోమవారం స్థానిక పౌరాసంస్థలో కొత్తపేట నియోజకవర్గస్థాయిలోని దళిత నేతలతో సమావేశం నిర్వహించారు. ఏడో తేదీ రావులపాలెం నుంచి ఈతకోట వరకు ఈ మార్చ్ నిర్వహిస్తామన్నారు.

ఘనంగా మే డే వేడుకలు

పాల్గొన్న ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి

రావులపాలెం: మండలంలోని వివిధ ప్రాంతాల్లో సోమవారం మేడే వేడుకలను కార్మికుల ఘనంగా నిర్వహించుకున్నారు. ఊబలంక, రావులపాలెం గ్రామాల్లో జరిగిన మేడే వేడుకలలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి పాల్గొని అందరికీ మేడే శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయన మాట్లాడుతూ దేశాన్ని గొప్పగా నిర్మించడంలో ఎందరో కార్మిక, కర్షక, శ్రమ జీవులు తమ చెమటను, రక్తాన్ని దారబోస్తున్నారన్నారు. అటువంటి వారు జరుపుకునే మేడే వేడుకల్లో పాల్గొనడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. ఊబలంకలో ఇసుకర్యాంప్ కార్మికులు, రావులపాలెంలో తాపీ మేస్త్రీల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చిర్ల జగ్గిరెడ్డి పాల్గొని కార్మిక జెండాను ఆవిష్కరించారు. పలువురు కార్మికులను సన్మానించారు. రావులపాలెంలో తాపీ మేస్త్రీల సంఘ సభ్యుడు కుకునూరి రాంబాబు ఇటీవల జరిగిన ప్రమాదంలో గాయపడి కోలుకోగా అతనికి ఎమ్మెల్యే జగ్గిరెడ్డి మేడే సందర్భంగా రూ.20 వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమాల్లో జెడ్పీటీసీ కుడుపూడి శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ గొలుగూరి మునిరెడ్డి, మాజీ ఎంపీటీసీ సభ్యులు కర్రి వీర్రెడ్డి, మల్లిడి రామిరెడ్డి, తాడి శ్రీనివాసరెడ్డి, మేడపాటి శ్రీనివాసరెడ్డి, అబ్బులు తదితరులు పాల్గొన్నారు.


రావులపాలెంలో కార్మికుడికి ఆర్థిక సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

మామిడికుదురు: హక్కుల సాధన కోసం కార్మికులు సంఘటితంగా ముందుకు సాగాలని నగరం ఎస్సై షేక్ జానీబాషా పిలుపునిచ్చారు. మేడే సందర్భంగా సోమవారం స్థానిక బస్టాండ్ కూడలిలో ఆటో యూనియన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మేడే పతకాన్ని సర్పంచ్ గౌస్ మొహిద్దీన్ ఆవిష్కరించారు. నగరం వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం వద్ద జట్టు కార్మికులు మేడే జెండా ఎగరవేశారు.

సఖినేటిపల్లి: స్థానిక సెంటర్లో సోమవారం మే డే సందర్భంగా ముత్యాలమ్మ అమ్మవారి తాపీ మేస్త్రిల సంఘం ఆధ్వర్యాన కార్మిక జెండాను ఎగరవేశారు. కార్మికుల ఐక్యత, పోరాటానికి నిలువెత్తు నిదర్శనం మే డే అని పార్టీ రాష్ట్ర కార్యదర్శి జంపన బుజ్జిరాజు, సర్పంచ్ గొల్లమందల చిట్టిబాబు అన్నారు. సోమవారం సఖినేటిపల్లి పంచాయతీ వద్ద మే డే సందర్భంగా 108 సిబ్బంది, పారిశుధ్యం సిబ్బందిలను వారు సత్కరించారు. అలాగే మండలంలోని పలు గ్రామాల్లో సీపీఐ నాయకుల ఆధ్వర్యాన మేడే వేడుకలు నిర్వహించారు.


మామిడికుదురులో మేడే వేడుకల్లో పాల్గొన్న ఎస్సై జానీబాషా

మలికిపురం: మండలంలో సోమవారం మేడే వేడుకలు ఘనంగా నిర్వహించారు. మలికిపురం, సఖినేటిపల్లి తాపీ మేస్త్రీల సంఘం ఆధ్వర్యంలో మలికిపురంలో జరిగిన మేడే వేడుకలలో ఇటీవల మృతి చెందిన ఐదుగురు కార్మికుల కుటుంబాలకు రూ.5 వేల చొప్పున ఆర్థికసాయం అందించారు.

పి.గన్నవరం: కార్మికులంతా ఐక్యంగా ఉంటూ తమ సమస్యల పరిష్కారానికి పాటుపడాలని ఎంపీపీ అంబటి భూలక్ష్మి అన్నారు. ముంగండ గ్రామంలో కార్మిక దినోత్సవ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. కార్మిక పతాకాన్ని ఎంపీపీ భూలక్ష్మి ఎగరవేశారు. స్థానిక నాయకులు అంబటి కోటేశ్వరరావు, కుసుమ వెంకటేశ్వరరావు, ముక్కామల కిష్టప్ప, కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.


సఖినేటిపల్లి సెంటర్లో కార్మిక జెండా ఆవిష్కరిస్తున్న తాపీమేస్త్రీల సంఘు సభ్యులు

కొత్తపేట: మేడే వేడుకలను సోమవారం మండలంలో కార్మిక, ఉపాధ్యాయ సంఘాలు ఘనంగా జరుపుకొన్నాయి. స్థానిక ఎంఆర్‌సీ కార్యాలయం వద్ద యూటీఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో మే డే నిర్వహించారు. అలాగే భవన నిర్మాణ కార్మిక సంఘు భవనం వద్ద సంఘు అధ్యక్షుడు ఏపూరి నరసన్న కార్మిక పతాకాన్ని ఆవిష్కరించారు. స్థానిక జట్టు కార్మిక యూనియన్ ఆధ్వర్యంలో సీనియర్ కార్మిక నాయకుడు గంగుమళ్ల రామారావు కార్మిక పతాకాన్ని ఆవిష్కరించారు.